

కడెం ప్రాజెక్టు




స్వర్ణ ప్రాజెక్టు గేట్లను ఎత్తేయడంతో నీట మునిగిన నిర్మల్‌లోని జీఎన్‌ఆర్ కాలనీ (ఫైల్)

# వరద లెక్కలపై గందరగోళం



కడెం ప్రాజెక్టు ఎగువన రెండేళ్ల క్రితం వచ్చిన వరదల కారణంగా కొట్టుకుపోయిన పసుపుల వంతెన (ఫైల్)

## ప్రాజెక్టుల్లోకి వచ్చే నీటి ప్రవాహంపై అయోమయం

- వరద ఉధృతిని నిర్ధారించలేకపోతున్న యంత్రాంగం
- నిర్మల్ జిల్లాలోని స్వర్ణ, గడ్డెన్నవాగు ప్రాజెక్టులకు ఇక్కట్లు
- గేజింగ్ స్టేషన్లు, సెన్సార్లు లేకపోవడం వల్లే సమస్యలు

నిర్మల్, జూన్ 24(నమస్తే తెలంగాణ) : నిర్మల్ జిల్లాలోని సాగు నీటి ప్రాజెక్టుల్లోకి వచ్చే వరద నీటి ప్రవాహపు లెక్కలు పక్కాగా ఉండడం లేదు. ఎగువ ప్రాంతం నుంచి రిజర్వాయర్లలోకి వస్తున్న వరద నీటిపై స్పష్టత లేని కారణంగా అధికారులు ప్రవాహ తీవ్రతతోనే లెక్కలు కట్టాల్సి వస్తున్నది. సీడబ్ల్యూసీ(కేంద్ర జల సంఘం) ఒక రకం, స్థానిక ఇరిగేషన్ శాఖ మరోరకంగా లెక్కలు చెబుతుండడంతో గందరగోళం నెలకున్నది. కడెం మినహా స్వర్ణ, గడ్డెన్న ప్రాజెక్టుల పరిస్థితి అధికారులకు తలనొప్పిగా మారుతున్నది. ఈ రెండు ప్రాజెక్టుల్లోకి గత వానకాలంలో భారీ వర్షాల కారణంగా పెద్ద ఎత్తున వరద నీరు వచ్చి చేరింది. ఈ ప్రాజెక్టుల్లోకి వచ్చిన వరద నీటి ప్రవాహ లెక్కలపై స్పష్టత లేకపోవడంతో దిగువకు నీటి విడుదల విషయంలో అయోమయం నెలకున్నది. భారీ వర్షాల సమయంలో ఇంజినీర్లు ప్రాజెక్టుల వద్దనే ఉండి వరద ఉధృతిని అంచనా వేసి దిగువకు నీటిని విడుదల చేసే పరిస్థితి ఉన్నది. ప్రధానంగా ఈ ప్రాజెక్టుల ఎగువ భాగాన రేయిన్ గేజ్ స్టేషన్లు, సెన్సార్లు లేకపోవడంతో వరద ప్రవాహాన్ని కచ్చితత్వంతో లెక్కించలేకపోతున్నారు. కడెంకు రేయిన్‌గేజ్ స్టేషన్, సెన్సార్లు పూర్తి నిన్న, మొన్నటి వరకు కడెం ప్రాజెక్టు ఎగువ భాగంలో కూడా వరద ప్రవాహాన్ని లెక్కించేందుకు ఎలాంటి ఏర్పాట్లు లేకపోవడంతో రెండు, మూడేళ్లుగా వస్తున్న ఆకస్మిక వరదలతో తీవ్ర నష్టం వాటిల్లిన సంగతి తెలిసిందే. ఒక దశలో పెద్ద ఎత్తున వచ్చిన వరద కారణంగా ప్రాజెక్టుకే ముప్పు వాటిల్లే పరిస్థితి వచ్చింది. కడెం ప్రాజెక్టు ఎగువ భాగాన కోట్ల రూపాయలు వెచ్చించి నిర్మించిన పసుపుల వంతెన పూర్తిగా కొట్టుకుపోయింది. రెండేళ్ల క్రితం వచ్చిన వరదలకు ప్రాజెక్టు ఎగువన గల గ్రామాలతోపాటు దిగువన తీవ్ర ఆస్తి నష్టం సంభవించింది. ఈ వరదలకు సంబంధించి ఆరు లక్షల క్యూసెక్కుల వరద వచ్చిందని ఇరిగేషన్ శాఖ అధికారులు ప్రకటించగా, సెంట్రల్ వాటర్ కమిషన్ 4.94 లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహం వచ్చిందని చెప్పింది. నీటి ప్రవాహాన్ని లెక్కించే వ్యవస్థ సక్రమంగా లేకపోవడం వల్లనే ఇలాంటి భిన్నమైన ప్రకటనలు చేసే పరిస్థితి ఏర్పడుతున్నది. దీనిని నివారించేందుకు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రాజెక్టు మరమ్మతులతోపాటు రేయిన్‌గేజ్ స్టేషన్లు, అత్యాధునిక సెన్సార్లను ఏర్పాటు చేసేందుకు అవసరమైన నిధులను మంజూరు చేసింది. అప్పటి నిధులతో ప్రాజెక్టు క్రస్ట్ గేట్లకు పూర్తి స్థాయి మరమ్మతులు చేపట్టారు. అలాగే రేయిన్‌గేజ్ స్టేషన్, సెన్సార్ల ఏర్పాటు వంటి పనులు ఇటీవలే పూర్తయ్యాయి.

### పేరుకుపోయిన పూడిక

మూడు ప్రధాన ప్రాజెక్టుల్లో పేరుకుపోయిన పూడికకు సంబంధించి కూడా ఎలాంటి స్పష్టత లేకపోవడంతో ప్రాజెక్టులోని గరిష్ట, కనిష్ట నీటి మట్టాల మధ్య భారీ తేడా వస్తున్నదని చెబుతున్నారు. పూడిక కారణంగా నీటి మట్టాల లెక్కలు సక్రమంగా తెలియక కాలువలకు నీటి విడుదల విషయంలో కూడా సమతుల్యత లోపిస్తున్నదన్న వాదనలు ఉన్నాయి. ఎగువ నుంచి వచ్చే వరదను లెక్కలోకి తీసుకోకుండానే రిజర్వాయర్ల నుంచి దిగువకు నీటిని విడుదల చేస్తుండడంతో తరచూ లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయి. గతంలో నిర్మల్ పట్టణంలోని జీఎన్ ఆర్ కాలనీ కూడా నీట మునిగిన సంగతి తెలిసిందే. స్వర్ణ ప్రాజెక్టుకు వరద పోటు తీవ్రమవడంతో ప్రవాహ ఉధృతి తెలియక ప్రాజెక్టు గేట్లన్నీ ఎత్తేశారు. దీంతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. అలాగే కడెం, గడ్డెన్న వాగు ప్రాజెక్టులకు కూడా వరద ప్రవాహం పెరగడంతో ఒకేసారి గేట్ల నుంచి నీటిని విడుదల చేశారు. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమై తీవ్ర నష్టం వాటిల్లింది. అప్పట్లో వచ్చిన వరదల కారణంగా దాదాపు రూ.5 కోట్ల విద్యుత్ స్తంభాలు, టవర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు నేలమట్టమయ్యాయి.

### గేజింగ్ స్టేషన్లు లేకనే..

స్వర్ణ, గడ్డెన్న వాగు ప్రాజెక్టుల ఎగువ ప్రాంతంలో రేయిన్ గేజింగ్ స్టేషన్లు లేకపోవడంతోనే వరద ఉధృతిని గుర్తించలేకపోతున్నారు. దీంతో ఈ రెండు ప్రాజెక్టుల్లోకి ఎంత మేరకు వరద వస్తున్నదన్న విషయం తెలుసుకునేందుకు ఇంజినీరింగ్ అధికారులు తంటాలు పడుతున్నారు. వరద తీవ్రతను తెలుసుకోవడంలో ఆలస్యం జరిగితే లోతట్టు ప్రాంతాలకు పెద్ద ఎత్తున నష్టం జరుగుతున్న సందర్భాలు ఉన్నాయి. ఇటీవలి కాలం వరకు కడెం ప్రాజెక్టు ఎగువన రేయిన్ గేజింగ్ స్టేషన్‌లు ఉన్నప్పటికీ ఆయా స్టేషన్లతో ప్రాజెక్టుకు అనుసంధానం లేక సమస్యలు ఉత్పన్నమయ్యాయి. ఈసారి లింకేజీ పూర్తి కావడంతో వానకాలంలో ఆ ఇబ్బందులు తప్పనున్నాయి. ప్రాజెక్టులకు ఎగువన గేజింగ్ స్టేషన్‌లు ఉండడం వల్ల వర్షపాతంతోపాటు వరద ఉధృతిని కూడా తెలుసుకునే అవకాశం ఉంది. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ప్రాజెక్టుల ఎగువ భాగాన గేజింగ్ స్టేషన్‌లతోపాటు, సెన్సార్లను ఏర్పాటు చేసి ఆకస్మిక వరదలను కట్టడి చేయాలని పలువురు కోరుతున్నారు.



గడ్డెన్న వాగు ప్రాజెక్టు



స్వర్ణ ప్రాజెక్టు

# తాగునీటికి తండ్లాట

**బాసర గ్రామంలోని** బోయగల్లీవాసుల పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది. తాగుదామంటే నీళ్లు దొరకని పరిస్థితుల్లో ఉంది. నాలుగు రోజుల నుంచి కాలనీలో మంచినీరు రావడం లేదని, అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని కాలనీవాసులు అధికారులపై మండిపడుతున్నారు. గంటల తరబడి ఆయా నీటి పంపుల వద్ద పనులు మానుకుని మంచి నీటికోసం వేచి చూస్తున్నామని, తమ పిల్లలను పాఠశాలకు పంపే సమయంలో పిల్లల స్నానాలు చేయకుండా పంపుతన్నామన్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి తమ కాలనీకి తాగునీరు సరఫరా చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు. *- బాసర, జూన్ 24*



కుళాయి వద్ద నీటి కోసం వేచి చూస్తున్న కాలనీవాసులు

# చాక్లెట్లు కొనిచ్చి.. పదేండ్ల బాలికపై లైంగికదాడి

### షీ టీం ద్వారా బట్టబయలైన ఘటన

ఎదులాపురం, జూన్ 24 : పదేండ్ల బాలికకు చాక్లెట్లు, బిస్కెట్లు కొనిస్తూ లైంగికదాడికి పాల్పడుతున్న ఘటన వెలుగులోకి వచ్చింది. షీ టీం బృందం సభ్యులు అన్ని పాఠశాల్లో అవగాహనకార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం ఆదిలాబాద్ పట్టణంలోని ఓ ప్రభుత్వ పాఠశాలలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో షీ టీం సభ్యులు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంలో పదేండ్ల బాలిక నిరసంగా ఉండడాన్ని గమనించారు. ఏమైందని ప్రశ్నించగా.. విషయాన్ని చెప్పింది. ఒకాయన రోజు రూ.10 చాక్లెట్లు కొనిస్తూ అసభ్యంగా ప్రవర్తించేవాడని తెలిపింది. స్పందించిన షీ టీం బృందం బాలిక కుటుంబ సభ్యులకు తెలిపారు. బాలిక తండ్రి వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. బంగారిగూడకు చెందిన వ్యక్తిపై పోక్సో కేసుతోపాటు బీఎన్‌ఎస్ చట్టాల కింద కేసు నమోదు చేశారు. అనంతరం రిమాండ్‌కు తరలించినట్లు షీ టీం బృందం ఇన్‌చార్జి సుశీల తెలిపారు. షీ టీం బృందం సభ్యులు వాణిశ్రీ, మహేశ్ పాల్గొన్నారు.

# బ్యాంకులో మిస్ ఫైర్

ఎదులాపురం, జూన్ 24 : ఆదిలాబాద్ పట్టణంలోని శివాజీ చౌక్‌లో ఉన్న ఎస్‌బీఐ ప్రధాన కార్యాలయంలో మంగళవారం ఉదయం తుపాకీ మిస్ ఫైర్ అయింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ప్రాణ నష్టం జరగలేదు. భద్రతా సిబ్బంది తన తుపాకీలో తూటాలు లోడ్ చేసేటప్పుడు పొరపాటున ట్రిగ్గర్‌కు వేలు తగిలి పైనున్న స్లాబ్‌కు తూటా తాకింది. ఈ సమయంలో బ్యాంకులో ఖాతాదారులు ఎవరూ లేకపోవడంతో బ్యాంకు అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ విషయమై బ్యాంక్ అధికారులు విచారణ చేస్తున్నట్లు సమాచారం. ఈ విషయంపై వన్ టౌన్ సీఐ సునీల్‌కుమార్‌ను వివరణ కోరగా.. మిస్ ఫైర్ అయిన విషయం నిజమేనని, ఎవరూ ఫిర్యాదు చేయలేదన్నారు.





మిస్ ఫైర్ అయిన తుపాకీ, పేలిన గుండు

# మొలకెత్తని విత్తనాలు.. ట్రాక్టర్లతో దున్నుతున్న రైతులు

దిలావర్‌పూర్, జూన్ 24 : మృగశిర కార్తేకు ముందే వరుణుడు పలకరించడంతో అన్నదాతలు విత్తనాలు విత్తారు. ఆ తరువాత వరుణుడు ముఖం చాటేయడంతో మొగులు వైపు చూస్తున్నా రు. ఈ వానకాలంలో మండలంలోని గుట్టల మీది గ్రామాలైన కదిలి, మాడెగాం, కుస్లీ, అంజీ తాండ, సాయినగర్ తాండల్లో పత్తి సాగవుతు న్నది. లక్షల రూపాయలు వెచ్చించి విత్తనాలు నాటారు. విత్తనాలు మొలకెత్తకపోవడం, భూమిలోనే మగ్గిపోవడంతో రైతులు ట్రాక్టర్లతో దున్నుతున్నారు.



మాడెగాంలో విత్తనాలు మొలకెత్తక పోవడంతో ట్రాక్టర్‌తో దున్నుతున్న రైతు

# సన్నబియ్యం అమ్మి.. సొమ్ము చేసుకుని..

## 25 కిలోల సంచుల్లో నింపి అక్రమంగా విక్రయం

- మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు తరలింపు
- కిరాణా దుకాణం, గోదాములపై విజిలెన్స్, టాస్క్‌ఫోర్స్ దాడులు
- 300 బ్యాగుల సన్న రేషన్ బియ్యం పట్టివేత
- లక్షల రూపాయలు సొమ్ము చేసుకుంటున్న దళారులు
- లబ్ధిదారులు విక్రయిస్తే కార్డు రద్దు చేస్తాం : వాజీద్ అలీ



పట్టుకున్న రేషన్ బియ్యాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్



పట్టుకున్న సన్నబియ్యంతో టాస్క్‌ఫోర్స్, విజిలెన్స్ అధికారులు

ఆదిలాబాద్, జూన్ 24(నమస్తే తెలంగాణ) : పేదలకు సన్నబియ్యం అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటన్న చర్యలు అక్రమార్కుల పాలిట వరంగా మారాయి. వర్షాకాలం నేపథ్యంలో పేదలు ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం మూడు నెలల బియ్యం ఒకేసారి పంపిణీ చేస్తున్నది. రేషన్‌కార్డుదారులకు ఒక్కొక్కరికి ఆరు కిలోల చొప్పున మూడు నెలల బియ్యం పంపిణీ ప్రక్రియ ఆదిలాబాద్ జిల్లాలోని 356 రేషన్ దుకాణాల్లో ఈ నెల 1 నుంచి ప్రారంభంకాగా ఈ నెల 30 వరకు కొనసాగనుంది. ఇప్పటికే చాలా మంది లబ్ధిదారులు మూడు నెలల బియ్యం తీసుకున్నారు. దొడ్డుబియ్యం పంపిణీ కారణంగా లబ్ధిదారులు బియ్యం వండి తినకుండా విక్రయిస్తున్నారని, సన్నబియ్యం పంపిణీ చేస్తున్నారు. ప్రభుత్వం మంచి ఉద్దేశంతో పంపిణీ చేస్తున్న సన్నబియ్యాన్ని ఉపయోగించాల్సిన కార్డుదారులు వాటిని దుర్వినియోగం చేస్తున్నారు. ప్రభుత్వం ఉచితంగా ఇస్తున్న బియ్యాన్ని కిలో రూ.12 చొప్పున రేషన్‌దుకాణాదారులు, దళారులకు విక్రయిస్తున్నారు. దీంతో ప్రభుత్వం లక్ష్యం నేరవేరకపోగా దళారులు సొమ్ము చేసుకుంటున్నారు.

### భారీగా నిల్వలు స్వాధీనం

ఆదిలాబాద్ పట్టణంలో మంగళవారం విజిలెన్స్, టాస్క్‌ఫోర్స్ అధికారులు శివాజీ చౌక్‌లోని రజిత కిరాణా దుకాణంలో 100 బ్యాగులు, దుకాణం పక్కన ఉన్న గోదాంలో 200 బ్యాగుల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. దళారులు బియ్యం అక్రమంగా తరలించడానికి కొత్త పన్నాగం ఎన్నుకున్నారు. కిరాణా దుకాణాల్లో లభించే సన్న బియ్యం మాదిరిగా రేషన్ బియ్యాన్ని 25 కిలోల సంచుల్లో ప్యాక్ చేశారు. అక్రమ రవాణాకు పాల్పడుతున్న వారు ప్రత్యేక గోదాంను ఏర్పాటు చేయడంతోపాటు సంచులను కుట్టడానికి ప్రత్యేక మిషన్‌ను వినియోగించారు. దళారులు బియ్యం మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు తరలించి కిలో రూ.20 చొప్పున విక్రయిస్తారు. బియ్యం అక్రమ వ్యాపారం వల్ల లక్షల రూపాయలు సొమ్ము చేసుకుంటున్నారు. అక్రమ రవాణాలో ముగ్గురు వ్యక్తులను ప్రాథమికంగా గుర్తించినట్లు అధికారులు తెలిపారు. రేషన్ కార్డుదారులు బియ్యం అవసరం లేకుంటే దుకాణాల నుంచి తీసుకోవద్దని, విక్రయించిన వారి కార్డులు రద్దు చేస్తామని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి వాజీద్ అలీ తెలిపారు.

### రేషన్ బియ్యాన్ని పరిశీలించిన ఎస్పీ

పట్టణంలోని శివాజీ చౌక్‌లోని రెండు దుకాణాల్లో పోలీసులు స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యాన్ని ఎస్పీ అఖిల్ మహాజన్ పరిశీలించారు. ఇద్దరు వ్యాపారుల దుకాణాల్లో 326 బ్యాగుల్లో నిల్వ ఉంచిన 79.30 క్వింటాళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ అక్రమ దందాలో రజిత కిరాణా దుకాణం నిర్వాహకుడు గూగుల్వార్ సంతోష్, ఆంధ్ర కిరాణ ఓనర్ షేక్ అయ్యూబ్‌తో పాటు చిలుకూరి లక్ష్మీనగర్‌కు చెందిన షేక్ అస్లాంలపై కేసు నమోదు చేశామన్నారు. పీడీఎస్ రైస్ విక్రయించే వారిపై సస్పెక్ట్ షీటలు ఓపెన్ చేస్తామని హెచ్చరించారు.